కథాకేళి

# అర్హత

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆరుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఆ ఇంటర్వ్యూకి వచ్చారు. విజయవాడ రైల్వే స్టేషన్ వారు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూ అది. హాజరయిన అభ్యర్థులంతా ఆ వుద్యోగం తమకి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. తమకే రావాలని దేముణ్ణి ప్రార్థిస్తున్నారు.

ఇంటర్వ్యూ మొదలైంది. మొదటగా లోపలకి వెళ్ళిన అభ్యర్థిని ఎగా దిగా చూసారు ఇంటర్వ్యూ బోర్డు మెంబర్స్ నలుగురు. ఆమె అప్లికేషన్ని చదివి పెదవి విరిచారంతా.

"ఆలిండియా రేడియోలో కథానికలు చదువుతుంటారా?" అడిగాడు స్టేషన్ సూపరింటెండెంట్.

"అవునండి. పాతికపైనే చదివాను" చెప్పిందా అమ్మాయి కోకిలని మరిపించే స్వరంతో.

"మీరు వెళ్ళొచ్చు" చెప్పాడు స్టేషన్‌మాస్టారు.

తర్వాతి అభ్యర్థి అప్లికేషన్ని చూసిన ఆ నలుగురు మొహాలు అసంతృప్తిని వెల్లడించాయి. రెండో అభ్యర్థి అడగకుండానే చెప్పింది.

"నేను రేడియో నాటికల్లో వేషాలు వేస్తుంటానండి. రేడియో ఆడిషన్ అయిదేళ్ళ క్రితం పాసయ్యాను. ఈ పోస్ట్ నాకిస్తే చక్కగా పని చేయగలను."

నలుగురు తల పంకించి బయటకి పంపేసారు ఆమెని. మూడో అభ్యర్థి కూడా అమ్మాయే.

"రేడియోలో అనౌన్సర్‌గా పని చేసారా మీరు కొంత కాలం?" అడిగాడు ఒకాయన.

'అవునండి. దయచేసి నన్ను సెలెక్ట్ చేసుకోండి' అన్నట్టుగా చూసి తల తిప్పింది అవునన్నట్టుగా.

"నీ పేరు?" అడిగాడొకాయన.

"లక్ష్మి. కేజువల్ అనౌన్సర్‌గా ఆలిండియా రేడియో, విజయవాడలో నల్నాలుగు నెలలు పని చేసానండి" చెప్పింది.

తర్వాతి అభ్యర్థి మొగ కాండిడేట్.

అతను అద్భుతంగా పాటలను పాడతాడని అప్లికేషన్‌కి జత చేసిన సర్టిఫికెట్ల ద్వారా తెలుసుకున్నారు ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లు. అతని ముందే చెవులు కొరుక్కున్నారు.

"నేను విజయవాడలో జరిగే అనేక సభల్లో కంపీర్‌గా కూడా పని చేస్తుంటానండి. నా గొంతు మైక్‌కి బాగా సూట్ అవుతుంది" చెప్పాడతను.

తలవూపారు ఇక వెళ్ళొచ్చు అన్నట్టు.

"నా పాటలు, పద్యాలు కేసెట్స్‌గా హెచ్.ఎం.వి. కంపెనీ రిలీజ్ చేస్తోందండి."

తనతో తెచ్చిన కొన్ని కాగితాలని రుజావు అన్నట్టుగా చూపించబోయాడతను. వాళ్ళు వాటిని చూడకుండా చెప్పారు.




"అవసరం లేదు. మీకు త్వరలో ఏ సంగతీ తెలియచేస్తాం."

అతను వెళ్ళాక వచ్చిన అమ్మాయి శాస్త్రీయ సంగీతాన్ని చిన్నప్పటి నుంచే నేర్చుకుంది. చాలాచోట్ల కచేరీలు చేసింది. మహానాడులో కూడా. ఆమె వెళ్ళాక మళ్ళీ ఆ నలుగురు తమకు తాము చర్చించుకున్నారు. తాము వెదికే కేండిడేట్ తమకి దొరకదేమో నన్న అనుమానం నలుగురు వెలిబుచ్చారు.

తర్వాత వచ్చిన కేండిడేట్ పేరు మేరీ. ఆమె కేరళ యువతి.

"తెలుగొచ్చా?" అడిగాడు స్టేషన్ సూపరింటెండెంట్ ఆసక్తిగా.

తల వూపింది బదులుగా.

"హిందీ, ఇంగ్లీష్?"

మళ్ళీ తల వూపింది.

"ఏదయినా మాట్లాడు" చెప్పాడు అసిస్టెంట్ స్టేషన్ సూపరింటెండెంట్.

ఆమెకి ఆ రోజు దిన పత్రికని అందించారు. ఆమె దాన్ని అందుకుని, 'రిజర్వ్‌డ్ ఖాళీలు త్వరలో భర్తీ' అన్న వాక్యాన్ని 'రిజరువుడు కాలీలు త్వర్లో బర్తీ' అని చదివింది. ఆమె గొంతు కర్ణకఠోరంగా వుంది. ఆ గొంతు ఆడవాళ్ళకి సంబంధించిందా లేక మగవాళ్ళకి చెందిందా అన్న అంశంమీద పోటీ పెడితే ఒక్కరూ గెలవని టైప్ గొంతు. పైపెచ్చు ఆమె మాటలు జాగ్రత్తగా విన్నా అసలది ఏ భాషో తెలిని విధంగా చదివిందా వాక్యాన్ని.

ఆ నలుగురి మొహాల్లో చిరునవ్వు. ఎంతో ఆనందంగా ఒకరి వంక మరొకరు చూసుకున్నారు.

"టాన్సిల్స్ ఆపరేషన్ చేయించుకుంటే గొంతు కుదుటపడుతుంది. కాస్త స్పష్టంగా..."

ఆమె మాటలకి అడ్డువస్తూ చెప్పాడు సూపరింటెండెంట్.

"ఇట్స్ ఓకే. మేం వెదికే కేండిడేట్ సరిగ్గా నువ్వే. రేపు డ్యూటీలో జాయిన్ అవు. ఆపరేషన్ లాంటి వాటి గురించి ఆలోచించకు."

"థాంక్యూ సర్" చెప్పింది ఆమె ఆనందంగా.

"బయట వున్న కేండిడేట్స్‌ని వెళ్ళిపొమ్మని చెప్పమ్మా" చెప్పాడు స్టేషన్ మాస్టర్ లేస్తూ.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైళ్ళ రాకపోకలను చెప్పే అనౌన్సర్ సెలెక్షన్ పూర్తయింది.

◆